# సాక్షి తిరుపతి

శుక్రవారం । 6 । జనవరి । 2023




తిరుపతి బులియన్

బంగారం :

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.57,460 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,132 |

వెండి:

| | |
|---|---|
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.69,700 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.71.70 |

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| తిరుపతి | 29 | 20 |
| చిత్తూరు | 29 | 19 |
| తిరుమల | 24 | 16 |
| గూడూరు | 30 | 22 |
| నగరి | 30 | 21 |



## తెప్పలపై కనువిందు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం శ్రీచండికేశ్వరస్వామి, శ్రీచంద్రశేఖరస్వామి వారు పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

## న్యూస్‌రీల్

### రుయాలో వృద్ధులకు ప్రత్యేక వార్డు



వృద్ధుల వార్డును ప్రారంభిస్తున్న దృశ్యం

**తిరుపతి తుడా :** స్థానిక రుయా ఆస్పత్రిలో వృద్ధులకు ప్రత్యేక వార్డును అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రుయాలో ఏర్పాటు చేసిన వృద్ధుల వార్డును ఎస్వీ మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్, వృద్ధుల సంరక్షణ శిక్షకులు డాక్టర్ ఎంఎస్ శ్రీధర్ గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సంరక్షణకు, వైద్య సేవలకు ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నాయని, ఈ క్రమంలోనే రుయాలో వృద్ధులకు ప్రత్యేక వార్డును అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. 30 పడకల సామర్థ్యంతో (పురుషులు–20, స్త్రీలు–10) ఈ వార్డును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వైద్యంతో పాటు ఓపీలు సైతం వృద్ధులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్, వైద్యులు గంటా శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఆస్పత్రి అడ్మిన్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

### టీబీ సర్వే పరిశీలన



క్షయపై అవగాహన కల్పిస్తున్న కేంద్ర బృందం

**ఏర్పేడు:** మండలంలోని పంగూరులో నేషనల్ టీబీఎలిమినేషన్ ప్రోగ్రాం (ఎన్‌టీఈపీ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటింటి టీబీ సర్వేని గురువారం డబ్ల్యూహెచ్‌ఓ బృందం పరిశీలించింది. గ్రామంలోని ప్రజలకు టీబీ లక్షణాలపై అవగాహన కల్పించారు. లక్షణాలు కలిగిన వ్యక్తుల గల్లను ట్రూనట్ సైట్‌కు పంపితే ఓ గంటలోపు రిజల్ట్ వస్తుందని తెలిపారు. నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తోందని చెప్పారు. జలుబు, దగ్గు, జ్వరం ఉందా..అని ప్రజలనడిగి తెలుసుకున్నారు. వారానికి మించి దగ్గు, జ్వరం, జలుబు ఉంటే పరీక్షలు చేసుకోవాలన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ ఐసీఎంఆర్ టీబీ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ సునీత, ఏర్పేడు పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఏఎస్‌ఎం శ్రీదేవి, ఎంఎల్‌పీహెచ్ వైష్ణవి, ఆశ వర్కర్ నాగభూషణ, వలంటీర్లు హరికృష్ణ, దొరబాబు పాల్గొన్నారు.

### 20 నాటికి పంట నమోదు ప్రక్రియ పూర్తిచేయండి

**తిరుపతి అర్బన్:** పంట నమోదు ప్రక్రియ ఈనెల 20వ తేదీనాటికి పూర్తికావాలని జేసీ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి పదేపదే చెప్పాల్సిన పనిలేదని.. తమకు అప్పగించిన బాధ్యతలను వంద శాతం పూర్తిచేయాలని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాలను గుర్తుచేశారు. పీఎంకిసాన్‌కు ఈకేవైసీ కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని చెప్పారు. గృహనిర్మాణాల్లో ప్రతి వారం పురోగతి చూపాలన్నారు. ఇంటి నిర్మాణాల కోసం స్వయం సహాయక మహిళలకు 30 వేల రూపాయలు మంజూరు చేసేలా చూడాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, డీపీఓ రాజశేఖరరెడ్డి, డీఎల్‌డీఓ సుశీలాదేవి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా ప్లానింగ్, స్టాటిస్టికల్ అధికారి అశోక్‌కుమార్, హార్టికల్చర్ డీడీ దశరథరామిరెడ్డి, ఏడీ సర్వేయర్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### కొండకు రోజూ 1,400 ట్రిప్పులు

**తిరుపతి అర్బన్:** న్యూ ఇయర్, వైకుంఠ ఏకాదశి పర్వదినాల సందర్భంగా తిరుమల కొండకు భక్తుల రద్దీ పెరిగిందని, ఈ నేపథ్యంలో ఈనెల 12 వరకు అదనపు బస్సులు తిరుగుతాయని జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి గురువారం తెలిపారు. రోజూ సరాసరి 94వేల మంది భక్తులను కొండకు తరలిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి నుంచి 1,400 ట్రిప్పులు తిరుమలకు నడుపుతున్నట్లు వెల్లడించారు. గతేడాది డిసెంబర్‌లో రోజూ 1,130 ట్రిప్పులు పడిపినట్టు ఆయన గుర్తుచేశారు.

### జేసీఎస్ కో-ఆర్డినేటర్ల నియామకం

**తిరుపతి మంగళం :** జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల కో–ఆర్డినేటర్లను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. ఆమేరకు పుత్తా శివశంకర్‌రెడ్డి తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు అన్నమయ్య, ఎస్‌ఆర్‌ఎస్‌పీ నెల్లూరు, ప్రకాశం జిల్లాల సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు.

తిరుమలలో స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న గవర్నర్ దంపతులు





తిరుపతిలో గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి





రేణిగుంటలో గవర్నర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు రజని, ఆర్కే రోజా, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ గురువారం ఆధ్యాత్మికానందంలో మునిగితేలారు. ముందుగా ఆయన రేణిగుంట ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బాలాజీ మెడికల్ కాలేజీలో 2022–23 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ బ్యాచ్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుపతికి చేరుకున్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన, ఆడిటోరియం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సమేతంగా తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు, అధికారులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.

– తిరుమల

# జగనన్న సైనికులు



రీజనల్ కో-ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితరులు



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

**‘అభిమానులు, కార్యకర్తలకు అండగా ఉంటాం. వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తాం. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వ హిస్తున్నాం. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్క రించే విధంగా చర్యలు చేపడుతున్నాం’ అని రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని తెలిపారు.**

- పార్టీ బలోపేతం బాధ్యత కార్యకర్తలదే
- అన్ని నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశాలు
- పార్టీ విధానాలపై విమర్శలు చేస్తే అధిష్టానం ఉపేక్షించదు
- వైఎస్సార్‌సీపీ రిజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

**చంద్రగిరి:** కార్యకర్తలే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైనికులని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తిరుచానూరు సమీపంలోని ఓ హోటల్‌లో గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలసి ఆయన నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుడూ సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎవరూ పెట్టలేదన్నారు. ఆ పథకాలు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేలా పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. మూడు జిల్లాల్లోని ప్రతి నియోజకవర్గంలో ముఖ్యమైన నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డితో కలసి శుక్రవారం సత్యవేడు, శనివారం గూడూరు, ఆదివారం సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో సమావేశాలుంటాయన్నారు. ప్రతి నెలా మూడు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలో పార్టీ జిల్లా అధ్యక్షులతో కలిసి పర్యటిస్తామని చెప్పారు.

**విమర్శలు చేస్తే చర్యల తప్పవు**

ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే చర్యలు తప్పవని బాలినేని స్పష్టం చేశారు. పార్టీ ముఖ్యమని, పార్టీని ధిక్కరించి మాట్లాడడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఈ మేరకు వెంకటగిరికి పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కో–ఆర్డినేటర్‌గా అధిష్టానం నియమించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇంకా మితిమీరి వ్యాఖ్యలు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోక తప్పదన్నారు. సినీ నటుడు బాలకృష్ణ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కోసం ఒంగోలు ఏబీఎం కళాశాలలో పరిశీలన చేశారని, అయితే అక్కడ భద్రత కల్పించడం కష్టతరమని ఎస్పీ తిరస్కరించారని తెలిపారు. ఇటీవల చంద్రబాబు నాయుడు కార్యక్రమాల్లో ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్న నేపథ్యంలో ఎస్పీ ఆ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

**క్లీన్ స్వీప్ లక్ష్యం**

రాబోయే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ లక్ష్యంగా పని చేయాలని బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ ఏ లోపం ఉన్నా వెంటనే వాటిని సరిదిద్దుకోవడానికి పరిశీలకులు పనిచేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేలు అధికారులను వెంటబెట్టుకుని ప్రతి గడపకు వెళ్లడం జరుగుతోందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు వీలుకలుగుతుందన్నారు. ఎమ్మెల్యేల గ్రాఫ్ కూడా పెరుగుతుందని తెలిపారు. ప్రజల మనసు గెలుచుకునేందుకు ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమేరకు దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్సీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపిద్దాం**

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్యాంప్రసాద్‌రెడ్డిని సీఎం బలపరిచారని తెలిపారు. సుమారు 3.83లక్షల ఓట్లు ఉన్నాయని, గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున నమోదైన దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యేలందరూ శ్యాంప్రసాద్‌రెడ్డిని బలపరిచి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరాడు.

**సత్తాచాటుదాం.. అందరినీ గెలిపిద్దాం**

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి, తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూడాలనే ప్రజల ఆకాంక్షను నెరవేర్చడమే తన విధి అని పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగా మంత్రులు, రీజనల్ కో–ఆర్డినేటర్లు, ఎమ్మెల్యేలు, పరిశీలకుల సహకారంతో జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తానన్నారు. సమావేశంలో మంత్రి ఆర్కే రోజా, ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సంజీవయ్య, వరప్రసాద్, కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ బల్లి చక్రవర్తి, పరిశీలకులు శైలజాచరణ్‌రెడ్డి, సీహెచ్ సత్యనారాయణరెడ్డి, చక్రపాణిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ముక్కాల ద్వారకనాథ్, దయాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జిల్లా ఓటర్లు 17,27,576



**తిరుపతి అర్బన్:** జిల్లాలో మొత్తం ఓటర్లు 17,27,576 మంది ఉండగా, అందులో మహిళా ఓటర్లు 8,79,992 ఉన్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2023 సాధారణ ఎన్నికల ఓటర్ల జాబితాను ఆయన విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని తెలిపారు. పురుష ఓటర్లు 8,47,343, ట్రాన్స్ జెండర్లు 241 మంది ఉన్నట్టు వెల్లడించారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ట్రాన్స్ జెండర్స్ |
|---|---|---|---|
| గూడూరు | 1,17,583 | 1,21,522 | 47 |
| సూళ్లూరుపేట | 1,13,304 | 1,18,432 | 45 |
| వెంకటగిరి | 1,13,510 | 1,18,581 | 2 |
| చంద్రగిరి | 1,41,302 | 1,47,513 | 64 |
| తిరుపతి | 1,43,785 | 1,44,290 | 48 |
| శ్రీకాళహస్తి | 1,17,039 | 1,23,719 | 20 |
| సత్యవేడు | 1,00,820 | 1,05,935 | 15 |
| మొత్తం | 8,47,343 | 8,79,992 | 241 |

### 8న జిల్లా స్థాయి లీగ్ రెజ్లింగ్ పోటీలు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఈ నెల 8వ తేదీ ఉదయం 8గంటలకు అండర్–17 బాలబాలికల జిల్లా స్థాయి లీగ్ రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ డాక్టర్ వీ.మురళీకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 2006 నుంచి 2008 మధ్య జన్మించిన వారు అర్హులని, ఆసక్తి గల వారు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ వెంట తీసుకురావాలని కోరారు.

## వైఎస్సార్ ముందుచూపుతోనే శ్రీసిటీ స్థాపన

**– ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని వెల్లడి**





కొమ్మినేనికి శ్రీసిటీ నమూనాను చూపిస్తున్న ప్రతినిధులు

**వరదయ్యపాళెం:** వైఎస్సార్ ముందుచూపుతోనే శ్రీసిటీ పారిశ్రామిక వాడ ఏర్పాటయ్యిందని, ఇది అత్యద్భుతమని, ఇలాంటివి మరో ఐదారు వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అభివృద్ధి పరంగా తిరుగుండదని ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం ఆయన శ్రీసిటీ సందర్శనకు రాగా శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా కొమ్మినేని స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రత్యేకించి వేలమంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్న శ్రీసిటీ ఈ ప్రాంతానికి ‘సిరి’సిటీ అంటూ ప్రశంసించారు. పరిశ్రమలతో పాటు సరికొత్త సమాజాన్ని స్థాపించారంటూ శ్రీసిటీ నిర్వాహకులను ఆయన అభినందించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దార్శనికత, గొప్పతనానికి శ్రీసిటీ సాక్ష్యంగా నిలుస్తోందని కొమ్మినేని పేర్కొన్నారు. తండ్రి బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాష్ట్రాభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే కొపర్తి, కృష్ణపట్నం, అచ్యుతాపురం పారిశ్రామికవాడలను కొత్తగా ఏర్పాటు చేశారన్నారు. ఇంతగా పరిశ్రమలు, పెట్టుబడుల కోసం కృషి చేస్తుంటే కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదని, ఉన్న పరిశ్రమలు వెళ్తున్నాయంటూ దుష్ప్రచారం చేయడం సరైన పద్ధతికాదన్నారు. అనంతరం ఆయన శ్రీసిటీలోని ఎవర్టన్ టీ, వెర్మీరియన్ పరిశ్రమలను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించడంతో పాటు ఉద్యోగులతో మాట్లాడి వారి బాగోగులను తెలుసుకున్నారు.

## ఆర్బీకేని సందర్శించిన తమిళనాడు సీఎంఓ ప్రతినిధులు



వివరాలు తెలుసుకుంటున్న సీఎంఓ ప్రతినిధులు

**పెళ్లకూరు:** తమిళనాడు రాష్ట్రం సీఎంఓ కార్యాలయ ప్రతినిధులు గురువారం పెళ్లకూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాల సరఫరా, పంట నమోదు, వ్యవసాయ యాంత్రీకీకరణ, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే రైతు భరోసా కేంద్రాలకు వచ్చే రైతుల వివరాలు, కోరుతున్న వ్యవసాయ పరికరాలు తదితర అంశాలకు సంబధించి నమోదు రిజిస్టర్‌ను కొనసాగించాలని సలహా ఇచ్చారు. సీఎంఓ కార్యాలయ ప్రతినిధులు బ్రిట్టోరాజ్, విగ్నేష్, జయశ్రీ, నాయుడుపేట వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు ధనుంజయరెడ్డి, ఏఓలు ప్రవీణ, కవిత, గణేష్, వీఏఏ అనూషభాను పాల్గొన్నారు.

## రుణమాఫీ పేరుతో బాబు టోపీ

- ‘పల్లెబాట’లో మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం



సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**చౌడేపల్లి (సోమల):** ‘దశాబ్దానికి పైగా ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఎన్నికల హామీలను గాలికొదిలేశాడు. ఓట్ల కోసం రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రజలకు టోపీ పెట్టేశాడు. ఇప్పుడు మళ్లీ మొసలి కన్నీరు కారుస్తూ మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యాడు.. ఇలాంటి వ్యక్తి రాష్ట్రానికి అవసరమా..?’ అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం పుంగనూరు నియోజకవర్గం, సోమల మండలపరిధిలోని అన్నెమ్మగారిపల్లి, తేటూరు, పెద్ద ఉప్పరపల్లి, ఆవులపల్లి, పంచాయతీల పరిధిలోని 48 పల్లెల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో టీడీపీ నేతలు మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. కరోనాకి ముందు ప్రతి గ్రామంలో ఏడాదికి రెండు సార్లు తిరిగి సమస్యలు పరిష్కరించే వాడినని, కరోనా తరువాత ఇది రెండో పల్లెబాట కార్యక్రమమని తెలిపారు.

**సంక్షేమానికి పెద్దపీట**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పుంగనూరు నియోజకవర్గం అనూహ్యంగా అభివృద్ధి చెందిందని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చినగొప్ప నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని తెలిపారు. పేద విద్యార్థులు అభివృద్ధి చెందలానే లక్ష్యంతో అనేక పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. ఆరోగ్యశ్రీకింద ఉచిత వైద్యంతోపాటు ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లాక కూడా కొండంత అండగా నిలబడుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాజకీయ నాయకులు ఓట్లు వేసే వారికి మాత్రమే పథకాలు అందించేవారని, కానీ ఓటు గురించి ఆలోచించకుండా అందరికీ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంతమని తెలిపారు. వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపనుందని తెలిపారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి దగా చేశారని, మహిళలు, రైతు రుణాలు మాఫీ అని చెప్పి మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని విరుచుకుపడ్డారు. ఇది కరువు పీడిత ప్రాంతమనే ఉద్దేశంతో గండికోట నీటిని హంద్రీ–నీవా ద్వారా అందించేందుకు సీఎం వైఎస్ జగన్ సిద్ధమయ్యారని తెలిపారు. ఇప్పటికే ముదివేడు, సుగాలిమిట్ట, అవులపల్లిలో ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేశామని, త్వరలోనే ఇంటింటికీ నీరు అందిస్తామని చెప్పారు. ఎన్నికల హామీలు అమలు చేసిన వ్యక్తిని మనం మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పిలుపునిచ్చారు.



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

# నదుల అనుసంధానంలో అరణియార్


పిచ్చాటూరులో నీటితో కళకళలాడుతున్న అరణియార్ జలాశయం


అరణియార్‌పై ఎన్‌డబ్ల్యూడీఏ బృందం పరిశీలన(ఫైల్)

- పెన్నార్ నుంచి గ్రాండ్ ఆనికట్‌కు కెనాల్
- డీపీఆర్ సిద్ధం చేసి రాష్ట్ర అభిప్రాయాలకు పంపిన వైనం
- దీనివల్ల జిల్లాలో పెరగనున్న ఆయకట్టు

**పిచ్చాటూరు:** నదుల అనుసంధానంలో జిల్లాలో అతిపెద్ద జలాశయం అరణియార్‌ను కలుపుతూ నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) డీపీఆర్ తయారు చేసింది. ఈ డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)లో గోదావరి–పెన్నార్(సోమశిల) నుంచి పిచ్చాటూరు అరణియార్ మీదుగా గ్రాండ్ ఆనికట్(కావేరి) కెనాల్ ద్వారా అనుసంధానం చేసేటట్లు పొందుపరిచారు. 2022 మార్చిలో ఈ డీపీఆర్‌ను కెనాల్ పరివాహక ప్రాంత రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు కు తమ అభిప్రాయాలను తెలపాలని పంపారు. ప్రజల సమాచారం మేరకు డ్రాఫ్ట్ డీపీఆర్‌ని ఆన్‌లైన్‌లోనూ ఉంచారు. కేంద్ర ప్రభుత్వం గోదావరి–కావేరి అనుసంధానం ప్రాజెక్టును రెండు దశల్లో ప్లాన్ చేసింది. మొదటి దశలో సహ–పరివాహక రాష్ట్రాల ప్రయోజనాలను ప్రభావితం చేయకుండా గోదావరి బేసిన్‌లోని మిగులు జలాలను గుర్తించడం, ఈ జలాలను గోదావరి–కావేరి లింక్ ప్రాజెక్టు ద్వారా కావేరీ వరకు బదిలీ చేయడం. రెండవ దశ బ్రహ్మపుత్ర– గంగ– సుబర్నరేఖ– మహానది–గోదావరి నదులను అనుసంధానించడానికి సంబంధించినది, ఇందులో మొదటి దశకు ప్రాముఖ్యత ఇచ్చి 2022 మార్చిలో గోదావరి–కావేరి అనుసంధానం డ్రాఫ్ట్ డీపీఆర్‌ను పూర్తి చేసి ప్రభుత్వానికి సమర్పించారు.


### చివరి పాయింట్ మార్పునకు తమిళనాడు అభ్యర్థన

గోదావరి–కావేరి నదుల అనుసంధానం డీపీఆర్‌ను పరిశీలించిన తమిళనాడు ప్రభుత్వం చివరి పాయింట్ మార్పును కోరింది. కావేరి నదిపై గ్రాండ్ ఆనికట్‌కు బదులుగా కట్టలై బ్యారేజ్ వద్ద అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ఈ మేరకు నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) మరోసారి అలైన్‌మెంట్‌లో మార్పులతో రెండవ డీపీఆర్‌కు సర్వే పూర్తిచేసింది. పూర్తి చేసిన డీపీఆర్‌ను ప్రభుత్వం ముందుంచడానికి సిద్ధమైంది.

### జిల్లాలో పెరగనున్న ఆయకట్టు

నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చీఫ్ ఇంజనీర్ డాక్టర్ ఆర్.ఎస్.సంఖువా నేతృత్వంలో ఉన్నతాధికారులు బృందం 2021 డిసెంబర్ 22న మరోసారి అరణియార్‌ను సందర్శించింది. రెండవ అలైన్‌మెంట్‌లో సైతం అరణియార్‌ను పొందుపరిచామని స్థానిక అధికారుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా, అరణియార్ అధికారులు వర్షాకాలంలో అరణియార్‌కు 30 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉంటుందని, అందుకు తగ్గటుగా మాత్రమే గేట్లు ఉన్నాయన్నారు. నదుల అనుసంధానం కాలువలో వచ్చే నీటి శాతం ఆధారంగా మరో గేట్లును అమర్చుకోవాల్సి ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ బృందానికి సూచించారు. అరణియార్‌తో పాటు గాలేరు–నగరి కోసం ఏర్పాటు చేస్తున్న రేణిగుంట వద్ద ఉన్న మల్లిమడుగు–కేవీబీ పురం కెనాల్, పుత్తూరు సమీపంలో గోపాలక్రిష్ణాపురం వద్ద మూలకోన వంక, వేపగుంట చెరువు, నగరి సమీపంలో అడవికొత్తూరు చెరువులను అనుసంధానం చేయాలని జిల్లా అధికారులు ప్రతిపాదించారు. దీనివల్ల తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో 6.5 టీఎంసీ నిల్వ ఉండి దాదాపు 1.15 లక్షల ఎకరాలు సాగులోకి తేవచ్చని అధికారుల అంచనా.

### అరణియార్ రైతులకు వరం



గోదావరి–కావేరి అనుసంధానం ప్రాజెక్టులో అరణియార్‌ను కలపడం ఈ ప్రాంత రైతులకు గొప్పవరం. దీనివల్ల గోదావరి మిగులు జలాలతో ఎప్పుడూ జలాశయం నీటితో కళకళలాడుతుంది. దీనివల్ల చుట్టుపక్క ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. అరణియార్‌లో మత్స్య సంపద వృద్ధి చెందుతుంది.

**–రత్నారెడ్డి, డీఈఈ అరణియార్, పిచ్చాటూరు**

## ఫిబ్రవరి 1న విద్యార్థులకు కంఠస్థ పోటీలు

**తిరుపతి కల్చరల్:** హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 9 గంటల నుంచి తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో విద్యార్థులకు అచ్యుతాష్టకం, విష్ణు సహస్రనామ స్తోత్రం కంఠస్థ పోటీలు నిర్వహించనున్నారు. పదేళ్లలోపు విద్యార్థులకు 'అచ్యుతాష్టకం'పై పోటీలు ఉంటాయి. అలాగే 10 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు విష్ణు సహస్రనామ స్తోత్రం నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 9 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. అదే రోజు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. వివరాలకు 96766 15645లో లేదా అన్నమాచార్య కళామందిరంలోని కార్యాలయంలో సంప్రదించాలని టీటీడీ పీఆర్‌వో టి.రవి ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు విశ్వంలో ఉచిత సైనిక్ నమూనా ప్రవేశ పరీక్ష

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో శుక్రవారం ఉదయం 9 గంటలకు సైనిక్ నమూనా ప్రవేశ పరీక్షను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సైనిక్ స్కూల్లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 8వ తేదీన జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని, దానికి అనుగుణంగా నమూనా పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు 93999 76999, 86888 88802లో సంప్రదించాలని కోరారు.





## జాతీయ ఆర్చరీ క్రీడా పోటీలకు ఎంపిక


లోకేష్‌ను అభినందిస్తున్న డిప్యూటీ డీఈఓ

**గూడూరు:** విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 7వ తేదీ నుంచి జరగనున్న జాతీయ ఆర్చరీ క్రీడా పోటీలకు అండర్–14లో 30 మీటర్ల విభాగంలో గూడూరు పట్టణంలోని సీఎస్ఎం ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జి.వి.లోకేష్ ఎంపికయ్యాడు. ఈమేరకు గురువారం పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి జాతీయ పోటీలకు ఎంపికైన లోకేష్‌ను అభినందించారు. ఆయన వెంట హెచ్ఎం శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.సుబ్రమన్యంటున్నారు.

## బ్రిడ్జి పైనుంచి పడి బీపీఎం మృతి


మృతి చెందిన హరికృష్ణ

**దక్కిలి:** బైక్‌పై వెళ్తూ బ్రిడ్జిపై నుంచి కింద పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని డీ ఉప్పరపల్లె వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం..దక్కిలి మండలం, సంగనపల్లి గ్రామానికి పంచేటి హరికృష్ణ (21)బాలాయపల్లి మండలం, కడగుంట గ్రామంలో బ్రాంచ్ పోస్టుమాస్టర్(బీపీఎం)గా పనిచేస్తున్నాడు. రోజూలాగే గురువారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయల్దేరాడు. తిరిగి వచ్చే సమయంలో డీ ఉప్పరపల్లి బ్రిడ్జిపై అదుపు తప్పి కింద ఏట్లో పడి ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవ పరీక్ష కోసం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## 18 మందికి జరిమానా

**తిరుపతి లీగల్:** తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 18 మందికి రూ.29,200 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి గురువారం తీర్పు చెప్పారు. నిందితులను తిరుపతి ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి


మృతిచెందిన భార్యాభర్తలు

**తిరుచానూరు :** చిత్తూరు – నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలోని ఓటేరు గ్రామం వద్ద స్కూటర్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దంపతులు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ చిరంజీవి కథనం.. తిరుపతి రూరల్ మండలం, చిగురువాడకు చెందిన రమేష్ (47), అతని భార్య దేవయాని (42) సొంత పనులు ముగించుకుని స్కూటర్‌పై తిరుపతి నుంచి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో ఓటేరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుడు తిరుపతిలోని ఓ కుదువ దుకాణంలో పనిచేస్తుండగా, వారికి ఒక కుమార్తె ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిరుచానూరు సీఐ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

# ఛీ..ఛీ.. మరీ ఇంత అన్యాయమా!


ఒకటో తేదీ లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న అధికారులు (ఫైల్)

**పలమనేరు:** టీడీపీ నాయకులు గురువారం మున్సిపాలిటీలోని గొబ్బిళ్ల కోటూరుకు చెందిన ఇద్దరు దివ్యాంగులు, వారి తల్లిని పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయానికి పిలిపించి, వారితో అయ్యా తమకు పింఛన్ రాలేదని చెప్పించి, డ్రామా ఆడించి దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. కానీ ఇదంతా ఒట్టి డ్రామానేనని అధికారులు తేల్చారు. ఆ నిజాన్ని మళ్లీ సోషల్ మీడియాలో పెట్టి, నిరూపించారు. ఈ సంఘటన గురువారం పలమనేరులో హాట్ టాపిక్‌గా మారింది. ఇందుకు సంబంధించిన పచ్చినిజాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని గొబ్బిళ్ల కోటూరుకు చెందిన వీరమ్మ(55)కు వితంతు పింఛను ప్రతినెలా రూ.2750, ఈమె కుమారులైన శంకరయ్య(25), లక్ష్మీనారాయణ(24)కు దివ్యాంగ పింఛన్లుగా ఒక్కొక్కరికి రూ.3 వేలు మొత్తం రూ.8,750 ప్రతినెలా అందుతోంది. ఈ నేపథ్యంలో పింఛన్ల సామాజిక తనిఖీలో భాగంగా గతనెల 27న గంటావూరు సచివాలయ అధికారులు జలంధర్, వెల్ఫేర్ సెక్రటరీ శివ కుమార్ వారికి సిక్స్‌స్టెప్ వ్యాలిడేషన్ ఫారాలను ఇచ్చారు. గత నెల 28న వారి ఇంటిని కొలచి రికార్డులోకి ఎక్కించారు. నిబంధనల మేర ఇళ్లు ఉండడంతో పింఛన్లకు అర్హులేనంటూ ఆన్‌లైన్‌లో వారికి మంజూరు చేశారు. ఈనెల ఒకటో తేదీ ఉదయం ఆరుగంటలకే ఆ వార్డు వలంటీర్ సింధు, అక్కడి పంచాయతీ కన్వీనర్లు, అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి ఆ కుటుంబంలోని ముగ్గురికి పింఛన్లను అందజేశారు. ఇందుకు సంబంధించి వారు సంతకాలు చేశారు. అయితే వారిని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఇకపై మీకు పింఛన్లు రావని బెదిరించినట్టు తెలిసింది. పింఛన్లు నమ్ముకుని బతికే తమకు వచ్చేనెల పింఛన్లు రావేమోనని వారు టీడీపీ నాయకులు సూచనలతో పట్టణంలోని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇంటి ముందు ఆర్తనాదాలు చేస్తూ వెళ్లి తమ కుటుంబంలో అందరికీ పింఛన్లు తొలగించారని చెప్పడం, ముందుగానే పథకం పన్నిన టీడీపీ నేతలు ఆ సంఘటనను వీడియో తీసి, సోషల్ మీడియా వైరల్ చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, అక్కడి కౌన్సిలర్లు రవి, కన్వీనర్ జాఫర్ అక్కడకు వెళ్లి వాస్తవాలను మళ్లీ వారినోటే చెప్పించారు. వారు పింఛను తీసుకున్నట్టు ఆధారాలను సోషల్ మీడియాలో పెట్టారు. ప్రభుత్వం అర్హులకు పింఛన్లులిస్తున్నా తప్పుడు ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా టీడీపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేస్తామని అధికారులు తెలిపారు. ఏదేమైనా టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలపై జనం అసహ్యించుకుంటున్నారు.

# జ్యువెలరీ షాపునకు వడ్డన

**తిరుపతి లీగల్ :** తప్పుడు ప్రకటనలతో వినియోగదారులను ఆకర్షించి సేవా లోపానికి పాల్పడినందుకు వినియోగదారునికి పరిహారం చెల్లించాలని లలిత జ్యువెలరీని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. తిరుపతి అక్కారంపల్లికి చెందిన ఎ.మాధవి 2019 మార్చి 11న తిరుపతి వీవీ మహల్ రోడ్డులోని లలిత జ్యువెలరీ దుకాణంలో తన వద్దనున్న 73.50 గ్రాముల బంగారు నగను రూ.1,96,438కు విక్రయించారు. షాపు యాజమాన్యం ప్రకటనలో పాత బంగారం ఇస్తే కొత్త బంగారు అదే రేటుకు ఇస్తారని, వేస్టేజ్, ఖర్చులు కూడా ఉండవని తెలపడంతో ఆమె ఆదే విధంగా తనకు కొత్త కాసుల హారం కావాలని ఆర్డర్ ఇచ్చారు. 11 నెలల తర్వాత ఆమె కాసుల హారాన్ని తీసుకోవడానికి షాపునకు వచ్చారు. అప్పుడు బంగారుకు ఉన్న రేటును చెల్లించాలని, వేస్టేజ్ ఖర్చులు కూడా ఇవ్వాలని సిబ్బంది ఆమెను హుకుం జారీ చేశారు. దీనిపై ఆమె తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు పార్థసారథి, సభ్యులు నాగశిధర్‌రెడ్డి, స్నేహలత ఇరువైపులా వాదనలు విన్నారు. అనంతరం ఏ.మాధవికి వంద గ్రాముల హారాన్ని వేస్టేజ్ ఖర్చులు లేకుండా ఇవ్వాలని తీర్పు చెప్పారు. అలాగే ఆమెను మనోవేదనకు గురిచేసినందుకు నష్ట పరిహారం కింద రూ.లక్ష, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.6 వేలను 45 రోజుల్లోపు చెల్లించాలని పేర్కొన్నారు. అలా చెల్లించని ఎడల వంద గ్రాముల హారం విలువతో పాటు నష్ట పరిహారం కింద ఇచ్చిన రూ.లక్షతో కలిపి 12 శాతం వడ్డీ లెక్కన షాపు యాజమాన్యం ఆమెకు చెల్లించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

# రూ.4.97 కోట్లకు ఐపీ

**తిరుపతి తుడా :** తిరుపతి రూరల్ అవిలాలకు చెందిన వై.నాగరత్న తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.4కోట్ల 97లక్షల 98వేలకు ఐపీ దాఖలు చేసినట్టు ఆమె తరపు న్యాయవాదులు సురేష్‌బాబు, భాస్కర్ గురువారం తెలిపారు. పిటీషన్‌లోని వివరాలు.. పిటీషనర్ నాగరత్న 15 ఏళ్లుగా తిరుపతి రూరల్ మండలం, అవిలాలలో చీరలు, డ్రస్ మెటీరియల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో పోటీ ఎక్కువగా ఉండడంతో కొంత మందికి వస్త్రాలను తక్కువ రేటుకు విక్రయించడం, అప్పుగా వస్త్రాలను విక్రయిస్తూ వచ్చారు. వ్యాపారం అభివృద్ధి కోసం కొంతమంది వద్ద అధిక వడ్డీలకు అప్పుగా తీసుకుంటూ వచ్చారు. వ్యాపారంలో మెలకువలు తెలియకపోవడంతో నష్టాలపాలయ్యారు. తర్వాత ఇతరుల వద్ద అప్పుగా తీసుకుంటూ వారికి ఖాళీప్రానోట్లు, చెక్కుల్లో సంతకాలు చేస్తూ వచ్చారు. రెండేళ్ల క్రితం కోవిడ్ రావడంతో షాపును మూసేశారు. దీంతో షాపులోని వస్త్రాలు దెబ్బతిన్నాయి. రుణదాతలు సొమ్ము చెల్లించాలంటూ వేధించడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో ఆమె ఐపీ దాఖలు చేసుకున్నట్టు పిటీషన్‌లో పేర్కొన్నారు. 95 మంది రుణదాతలను ఆమె పిటీషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నారు. రుణదాతలు ఎక్కువగా తిరుపతి రూరల్ ప్రాంతానికి చెందిన వారుగా ఉన్నారు. అలాగే ఆమె ప్రస్తుతం తన వద్ద రూ.450 విలువ చేసే మూడు చీరలు, మూడు జాకెట్లు మాత్రమే ఉన్నట్టు ఆమె పిటీషన్‌లో పేర్కొన్నారు.

# ఆర్టీసీ టెండర్లకు స్పందన కరువు

- 79 దుకాణాలకు 21 దరఖాస్తులు
- పార్కింగ్ సెంటర్లకు నిల్

**తిరుపతి అర్బన్:** ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న 79 దుకాణాల భర్తీకి టెండర్లు ఆహ్వానించగా 21 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. వాటిలో 17 మాత్రమే పూర్తి వివరాలతో ఉన్నట్లు అధికారులు తెలిపారు. తిరుపతి బస్టాండ్‌లోని 33 దుకాణాలకు 4 దరఖాస్తులు మాత్రమే అందాయి. అలాగే రెండు స్కూటర్ పార్కింగ్ సెంటర్లకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. తిరుపతి బస్టాండ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారని, ఈ క్రమంలో బస్టాండ్‌ను తొలగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అందువల్లే వ్యాపారులు దరఖాస్తులు చేసుకోవడానికి ఆసక్తి చూపడంలేదన్న చర్చ సాగుతుంది. అధికారులు వ్యాపారులకు అవగాహన కల్పించకపోవడంతోనే దరఖాస్తులు తక్కువగా వచ్చినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్, పీవో పార్థసారథి, డీఎం బాలాజీ, ఏవో చంద్రమణి, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఆట పాటలకు సై



యువజనోత్సవంలో గానాలాపన చేస్తున్న విద్యార్థినులు


సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌లో గానం చేస్తున్న విద్యార్థులు

**తిరుచానూరు:** శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో పద్మతరంగ్ పేరుతో నిర్వహిస్తున్న యువజనోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం విద్యార్థినీ విద్యార్థులు పలు పోటీల్లో తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. యువతీయువకులు తమ కళానైపుణ్యాలతో ప్రేక్షకులను అలరించారు. చదువుతో పాటు ఆట పాటలకు సై అంటూ చక్కటి అభినయం, హావభావాలతో అదరహో అనిపించారు. వివిధ యూనివర్సిటీల విద్యార్థినీ విద్యార్థులు రాజ్యాంగాన్ని కాపాడాలి, లింగ సమానత్వం, మహిళల రక్షణ వంటి అంశాలతో స్కిట్లను అద్భుతంగా ప్రదర్శించి, ఆలోచనలు రేకెత్తించారు. అలాగే భరతమాత వైభవాన్ని చాటుతూ విద్యార్థినులు ఆలపించిన బృంద గీతం ఆకట్టుకుంది. అలాగే పాశ్చాత్య సంగీతాన్ని ఆలపించడంతోపాటు పాశ్చాత్య వాయిద్యా విన్యాసాలను ప్రదర్శించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన ఈ యువజనోత్సవాల్లో క్విజ్, ఏకపాత్రాభినయం, శాస్త్రీయ, జానపద నృత్యాలు, బృంద గానం, మ్యాజిక్ షో తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. వివిధ వర్సిటీలకు చెంచిన సుమారు 53 బృందాలు పాల్గొని, తమ దైన శైలిలో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ జమున, రిజిస్ట్రార్ ఎం.రజిని, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.